సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



సామూహిక అక్షరాభ్యాసాలు
సింహాచలం: వసంత పంచమిని పురస్కరించుకుని సింహగిరిపై చిన్నారులకు అక్షరాభ్యాసాలు విశేషంగా జరిగాయి.



పురస్కార ప్రదానం
ఉక్కునగరం: ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగం ఉద్యోగి గిరిబాబుకు వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డు లభించింది.



సూర్యదేవుని కల్యాణం
అనకాపల్లి టౌన్ : రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- తగ్గని మంచు తీవ్రత
- చింతపల్లి, జి.మాడుగులలో 9.5 డిగ్రీలు



లంబసింగిలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలలో స్వల్ప మార్పులు చోటుచేసుకుంటున్నాయి. హెచ్చుతగ్గులతో కూడిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా మంచు తీవ్రత కొనసాగుతుండడంతో మన్యం వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం చింతపల్లి, జి.మాడుగులలో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో హుకుంపేటలో 9.6 డిగ్రీలు, జీకే వీధిలో 10.0, అరుకువేలిలో 10.2, పాడేరులో 10.3, పెదబయలులో 11.6, ముంచంగిపుట్టులో 13.2, డుంబ్రిగుడలో 13.6, కొయ్యూరులో 14.8 డిగ్రీలు, అనంతగిరిలో 17 డిగ్రీలు నమోదయినట్లు ఏడీఆర్ తెలిపారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల
పాడేరు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరకువ్యాలీలో ఒకటి, పాడేరులో ఒకటి, చింతూరులో ఒకటి, చింతపల్లిలో రెండు, రంపచోడవరంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు జరుగుతాయన్నారు. 3న ఇంగ్లీష్, 5న హిందీ/తెలుగు/ఉర్దూ, 7న రసాయన శాస్త్రం/ఆర్థిక శాస్త్రం/సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం/రాజనీతి శాస్త్రం/మనో విజ్ఞాన శాస్త్రం, 12న గణితం/చరిత్ర/వ్యాపార గణక శాస్త్రం, 15న జీవశాస్త్రం/వాణిజ్య శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అన్ని పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాల్లో 1699 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని చెప్పారు.

మరోసారి కాఫీ ధరల పెంపు
చింతపల్లి: గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి మరోసారి తాజాగా కాఫీ కొనుగోలు ధరలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్టు చింతపల్లి జీసీసీ డీఎం దేవరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిలో పార్చిమెంటు ధర రూ.350, చెర్రీ కాఫీ ధర కిలో రూ.230, రొబస్టా కాఫీ ధర రూ.160గా పెంచారన్నారు. గతంలో రూ.285 గా ఉన్న పార్చిమెంటు ధర దశలవారీగా రూ.350కి చేరగా.. చెర్రీ ధర గతంలో 150 ఉండేదన్నారు. దీన్ని రూ.230కి పెంచామన్నారు. రొబస్టా ధర గతంలో రూ.కేవలం రూ.80 ఉండగా దీని ధర ప్రస్తుతం రూ.160కి పెంచామన్నారు. చింతపల్లి డివిజన్ పరిధిలో 650 మెట్రిక్ టన్నుల కాఫీ సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని డీఎం తెలిపారు. జీసీసీ సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించినట్టు తెలిపారు.

అధికారుల తీరు సిగ్గుగా ఉంది



“సీలేరు రోడ్డుకు టెండరు పూర్తయినా పనులు ప్రారంభం కాకపోవడం సిగ్గుచేటు. ఆర్‌ఎండ్‌బీ అధికారులు రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలి. ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు గతుకుల రోడ్ల వలన నరకం చూస్తున్నారు. **అత్యవసర సమయంలో** వైద్యానికి వెళ్లేవారు, **గర్భిణులు సైతం ఇబ్బందులు** పడుతున్నారు.”
–కారె శ్రీనివాస్, సీలేరు



సీలేరు నుంచి పాలగెడ్డ వరకు గోతులమయంగా రహదారి

నరక దారులు

75 కి.మీ.. 250 గోతులు

సంక్రాంతికి సీలేరు రోడ్డు పూర్తి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం

టెండర్లు పూర్తయినా కానరాని పనులు

అమలు కాని ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ మాటలు

నిజంగా నిజం... అది అచ్చమైన నరకం.. నమ్మశక్యం కాకపోతే, అతిశయోక్తిలా అనిపిస్తే ఒకసారి ఆ రోడ్డుపై ప్రయాణించండి. ఏ పాపం చేశాం.. ఎందుకు మాకీ శిక్ష అనిపిస్తుంది. విశాఖపట్నం నుంచి అందాల లంబసింగి మీదుగా సీలేరు దాటుకొని వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి సీలేరు ఘాట్ రోడ్డు.. ఈ రహదారిని అభివృద్ధి చేస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్రాంతికి పనులు పూర్తి చేస్తామని ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ చెప్పారు. కానీ ఈ రోడ్డు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

సీలేరు: సంక్రాంతికి రహదారులకు మహర్దశ పడుతుందని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పినా.. ఇప్పటికీ తిప్పలు తప్పడం లేదు. మాటలు చెప్పడమే గానీ ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. అంతులేని నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్రాంతికి గుంతలు లేని రహదారులను నిర్మించాలని, లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని చెప్పింది. మాటలే గానీ చేతలు లేవని ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. జి.కె.వీధి మండలం ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న 75 కి.మీ దూరం పూర్తిగా ప్రమాదకరమైన రహదారి. ఇందులో 250 పైగా గోతులు చెరువులు తలపించేలా దర్శనమిస్తాయి. గత ఏడాది సెప్టెంబరు నెలలో తుఫాను అతలాకుతలం చేసి ఘాట్‌రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. సుమారు 30 రోజులు ఘాట్‌రోడ్డు మూసుకుపోయి ప్రయాణాలు నిలిచిపోయాయి. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌ఎండ్‌బీ అధికారులు ధ్వంసం అయిన రోడ్లను తాత్కాలికంగా పునరుద్ధరించి చేతులు దులుపుకున్నారు. ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ఈ ప్రాంతంలో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సంక్రాంతికి గోతులు లేని రోడ్లు నిర్మిస్తామని, సీలేరు రోడ్డుకు రూ.23 కోట్లు మంజూరయిందని చెప్పారు. పనులు సంక్రాంతికి పూర్తవుతాయని హామీ ఇచ్చారు. సంక్రాంతి వెళ్లి రెండు వారాలైనా ఇప్పటికీ సీలేరు రోడ్డు పరిస్థితి యథాతథంగా అప్పట్లాగే ఉంది.



ఘాట్‌రోడ్డులో అంతర్ రాష్ట్ర రహదారి ప్రస్తుత దుస్థితి

నిలిచిన బస్సు సర్వీసులు
సీలేరు రోడ్లు ధ్వంసం కావడంతో ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరినా రోడ్లు బాగు చేయించండి అంటూ తిరిగి సమాధానమిస్తున్నారని వారు వాపోతున్నారు. రోడ్లు ధ్వంసం అవడం వలన ప్రమాదాలకు దారితీస్తున్నాయి. పర్యాటకులు ఈ మార్గంలో ప్రయాణాలు మానుకుంటున్నారు. అర్ధరాత్రి తిరిగే విశాఖపట్నం-హైదరాబాదు బస్సు, పాడేరు-భద్రాచలం బస్సు, విశాఖపట్నం-మల్కన్‌గిరి బస్సులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు.



ఇటీవల రోడ్డును పరిశీలించిన ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్

టెండర్లు పూర్తయినా కానరాని పనులు
ఆర్వీ నగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న 75 కి.మీ రహదారిలో ఆర్వీ నగర్ నుంచి బంధవీధి వరకు 13 కి.మీ, దారాలమ్మ తల్లి **ఆలయ ఘాట్ రోడ్డులో 4 కి.మీ, సీలేరు** నుంచి పాలగెడ్డ **వరకు ఉన్న 20 కి.మీ. రోడ్డులో ఉన్న గో**తులను పూడ్చి **రోడ్డు వేసేందుకు ఇప్పటికే టెండర్లు పూర్త**య్యాయి. కానీ **ఆర్ ఎండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటి**వరకు ప్రారం**భం కాలేదని, మరింత తాత్సారం** చేస్తే ఆ నిధులు **వెనక్కు వెళ్లే పరిస్థితి ఉంటుందని ప**లువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మండల సమావేశంలో పలు పార్టీ నాయకులు అధికారులను నిలదీశారు.

ప్రమాదకరం



“సీలేరు రోడ్డు తక్షణమే నిర్మించాలి. సంక్రాంతి పండుగకు రోడ్లు పూర్తవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాదులో ఉన్న నేను సంక్రాంతికి స్వగ్రామం సీలేరు వెళ్తే అక్కడ రోడ్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి.”
– సందీప్, హైదరాబాద్

హృద్రోగులకు అందుబాటులో ఖరీదైన ఇంజక్షన్
రంపచోడవరం: గుండెనొప్పికి గురైన రోగులకు అత్యవసరంగా అందించే టెనిక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్ రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.టి.వి.శేషిరెడ్డి తెలిపారు. ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టెనిక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్ ఉచితంగా చేస్తామన్నారు. రూ.50 వేల విలువైన ఈ ఇంజక్షన్ చేయడం ద్వారా గుండెనొప్పిని నివారించి ప్రాణపాయ స్థితి నుంచి కాపాడవచ్చన్నారు. గత ఏడాది 2024 సంవత్సరంలో గుండెపోటు వచ్చిన 13 మందికి ఈ ఇంజక్షన్లు ఉచితంగా చేశామన్నారు. రోగులు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు.

వచ్చే నెల 8 వరకు ‘మీ కోసం’ రద్దు
పాడేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రతి సోమ, బుధ, శుక్ర వారాల్లో ఐటీడీఏల్లో నిర్వహించే ‘మీ కోసం’ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ నేపథ్యంలో రద్దు చేశామన్నారు.





విద్యార్థులతో ముచ్చట్లు

సీలేరులో విదేశీయుల సందడి
సీలేరు: రష్యన్ దేశస్తులు సోమవారం సీలేరులో సందడి చేశారు. మన్యం అందాలు చూసేందుకు బస్సులో వచ్చిన వారంతా ఇక్కడి ప్రకృతి దృశ్యాలు చూసి ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. సీలేరు అందాలు చాలా బాగున్నాయని, ఉదయం మంచు అందాలు తమ మనసుల్ని దోచుకున్నాయని చెప్పారు. తాము 13 మంది బృందంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానిక యూసీఐఎం చర్చి వద్ద విద్యార్థులతో కాసేపు ముచ్చటించి ఇక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చర్చి పాస్టర్ మనస్సే, తదితరులు పాల్గొన్నారు.

తల్లీ నిన్ను దలంచి..
పాడేరులో సామూహిక అక్షరాభ్యాసం



పాడేరు రూరల్: సరస్వతీ మాత జన్మ నక్షత్రమైన వసంత పంచమిని పురస్కరించుకుని స్థానిక శ్రీఅక్షర ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాలల ప్రాంగణాల్లో సోమవారం ఘనంగా సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వేద మంత్రాల నడుమ చక్కని ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి చిన్నారులను తీసుకువచ్చి తల్లిదండ్రులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్త సింహాచలంనాయుడు, ఆయా పాఠశాలల నిర్వహకులు రాజేష్, బాబురావు, రవికుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కన్నీరు ఇంకినా కానరాని ఆచూకీ
- ఇద్దరు బాలల కోసం మూడో రోజూ కొనసాగిన గాలింపు
- దీన వదనాలతో నిరీక్షిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు
- నాటు పడవను బయటకు తీసిన వైనం

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న జోలాపుట్టు ప్రధాన జలాశయంలో శనివారం సాయంత్రం గల్లంతైన ఇద్దరు బాలల ఆచూకీ మూడు రోజులవుతున్నా సోమవారం నాటికీ లభించలేదు. కొరాపుట్టు ఓడీఆర్‌ఎఫ్ బృందాల గాలింపులు కొనసాగుతూనే ఉన్నాయి. జోలాపుట్టు జలాశయంలో నీటి నిల్వ పూర్తి స్థాయిలో ఉంది. దీంతో పాటు జలాశయం అడుగున పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో గాలింపునకు ఆటంకాలు కలుగుతున్నాయి. ముగ్గురు విద్యార్థులు ప్రయాణించిన నాటు పడవ వారితోపాటు మునిగిపోయింది. దానిని సోమవారం అతి కష్టం మీద బయటకు తీశారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు గాలింపు జరిపినా ఫలితం లేకుండా పోయింది. విద్యార్థుల ఆచూకీ లభ్యం కాలేదు. అంతకుముందు నందపూరు ఎస్‌డీపీవో సంబిత్ మజ్జి గాలింపు చర్యలను పరిశీలించారు. ప్రమాదం నుంచి బయటపడ్డ గౌతమ్‌ను సంఘటన జరిగిన ప్రదేశానికి రప్పించి, ప్రమాదం ఎలా జరిగిందో ఆరా తీశారు. ఇద్దరు స్నేహితులను కాపాడేందుకు ఎంతో ప్రయత్నం చేశానని, కానీ తన కళ్ల ముందే మునిగిపోయారని గౌతమ్ కన్నీటిపర్యంతమయ్యాడు. దీంతో అతనిని అక్కడ నుంచి ఇంటికి పంపించేశారు.



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ఒడిశా రాష్ట్రం పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్రో



జలాశయం నుంచి మునిగిన నాటు పడవను బయటకు తీస్తున్న ఓడీఆర్‌ఎఫ్ బృందం

విద్యార్థుల గల్లంతు బాధాకరం
జోలాపుట్టు జలాశయంలో విద్యార్థులు గల్లంతు కావడం చాలా బాధాకరమని పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్రో కాండం అన్నారు. సోమవారం జలాశయం వద్ద జరుగుతున్న గాలింపు చర్యలను ఆయన పరిశీలించారు. జలాశయం కిందన పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో గాలింపు కష్టంగా మారిందని ఎమ్మెల్యేకు ఓడీఆర్‌ఎఫ్ బృందాలు తెలిపాయి. ఆయన విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ముంచంగిపుట్టు, లంతాపుట్టు తహసీల్దార్లు నర్సమ్మ, ప్రభతి జ్యోతి, ఆర్‌ఐ రవికుమార్‌లు గాలింపు చర్యలను పర్యవేక్షించారు. శివ వంతాల, అమిత్ వంతాల కుటుంబ సభ్యులు జలాశయం ఒడ్డున ఓడీఆర్‌ఎఫ్ బృందాలు బయటకు తీసిన నాటు పడవను చూసి రోదిస్తూ ఉండడం అందరినీ కలచివేసింది. చీకటి పడటంతో సోమవారం గాలింపు నిలిపివేశారు.



ప్రమాదం నుంచి బయట పడ్డ గౌతమ్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌డీపీవో సంబిత్ మజ్జి



క్లుప్తంగా

ఆత్మహత్య ప్రేరేపణ కేసు నమోదు

అడ్డతీగల: మండలంలోని పింజరికొండకి చెందిన మిరియాల నాగేశ్వరరావు(35) ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నిందితుడు జర్తా అర్జునరెడ్డిపై ఆత్మహత్య ప్రేరేపణ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్ తెలిపారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపాలెంకి చెందిన జర్తా అర్జునరెడ్డి తన పొలంలో శనివారం పనిముట్లు పోయాయని ఇందుకు కారకుడిగా భావించి మిరియాల నాగేశ్వరరావును దుర్భాషలాడి చేయి చేసుకున్నాడు. తన పనిముట్లు ఇవ్వకపోతే విషం తాగి చావు అంటూ బెదిరించాడు. ఆ మాటలకు మనస్తాపం చెందిన నాగేశ్వరరావు పురుగుల మందు సేవించి అపస్మారకస్థితికి చేరడంతో కుటుంబసభ్యులు అడ్డతీగల సీహెచ్‌సికి తరలించారు.మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై ఆత్మహత్య ప్రేరేపణ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వినోద్ చెప్పారు.

నీటి ట్యాంకర్ బోల్తా: క్లీనర్ మృతి



బోల్తా పడిన ట్యాంకర్



నాగరాజు(ఫైల్)

కొయ్యూరు: జాతీయ రహదారిలో రోడ్డును తడుపుతున్న నీటి ట్యాంకర్ బోల్తా పడడంతో క్లీనర్ నాగరాజు అలియస్ చిన్ని అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి మట్టపనుకుల సమీపంలో చోటు చేసుకుంది. ఎం.మాకవరంకు చెందిన గలివెల నాగరాజు(35) జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్నాడు. బట్టపనుకుల గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డును నీటి ట్యాంకర్‌తో తడిపే పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఒక్కసారిగా నీటి ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ కింద నాగరాజు పడిపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్టు స్థానికులు చెప్పారు. నాగరాజు మృతి సమాచారంతో ఆయన నివాస ప్రాంతం ఎం.మాకవరంలో విషాదం నెలకొంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్‌వర్మ చెప్పారు.

బ్రహ్మాద్రి శిఖరాన ప్రత్యక్ష నారాయణుడు



రాజుపాలెంలో సూర్యనారాయణమూర్తి దేవాలయం



ప్రత్యేకాలంకరణలో సూర్యనారాయణమూర్తి



ఆంజనేయస్వామి దేవాలయం

- రాజుపాలెంలో నేడు రథసప్తమి వేడుకలు
- రెండో అరసవిల్లిగా ప్రతీతి
- సుమారుగా లక్ష మంది భక్తులు వస్తారని అంచనా
- గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు

అనకాపల్లి : ఉత్తరాంధ్రలో రెండో అరసవల్లిగా అభివృద్ధి చెందుతున్న జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ప్రతినిధులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తెలిపారు. రథసప్తమి పురస్కరించుకుని సుమారుగా లక్షమంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో కమిటీ సభ్యులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు.

ఆలయ చారిత్రక నేపథ్యం...

బ్రహ్మాద్రిపై వెలిసిన సూర్యనారాయణస్వామికి చారిత్రక నేపథ్యముంది. రాజుపాలెం గ్రామానికి అనుకుని ఉన్న బ్రహ్మాద్రిపై నాలుగు దశాబ్దాల క్రితం స్వామివారి శిలావిగ్రహం దొరికింది. పరిసర గ్రామాలకు చెందిన గొర్రెల కాపరి కొండపైకి వెళ్లినప్పుడు స్వామివారి విగ్రహం లభించడంతో అనాటి నుంచి రథోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. రథోత్సవం రోజున గతంలో స్వామివారిని ఊరేగించి సమీపంలో ఉన్న ఉప్పునీటి నూతిలో వేసేవారు. కొన్నేళ్లకు బావి పూడికపోయింది. స్వర్గీయ అనకాపల్లి మాజీ ఎంపీపీగా పనిచేసి కొణతాల బాబురావు చొరవ తీసుకుని రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవస్థానాన్ని స్థానికుల సహకారంతో నిర్మించి అదనపు హంగులు కల్పించారు. ఆలయ పరిసరాల్లో యాగశాల, ఆంజనేయస్వామి విగ్రహం, వైకుంఠనారాయణస్వామి విగ్రహం, ద్వాదశ ఆతిథ్యులు, సప్తరుషి యాగశాల, నాగబంధ ఈశ్వరుడు, లలితాదేవి, సుదర్శమూర్తి ఆలయాలు ఏర్పాటు చేశారు.

ఈ ఏడాది కొత్తగా లలితాదేవి ఆలయానికి మెట్ట మార్గం, జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వీవీఐపీ భక్తులకు ప్రత్యేక రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు విశ్రాంతి మందిరం, ఆనంద నిలయాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు ఇలా...

స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తే అవకాశమున్నందున బారికేడ్లు ఏర్పాటు చేశారు. చలువపందిళ్లను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు అందజేయనున్నారు.

భారీ అన్నసమారాధన

రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని వ్యాపారవేత్త బండారు ఆదిబాబు, సూరిబాబు, రమణ దంపతులు ఆధ్వర్యంలో సుమారుగా 18వేల మందికి మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆలయానికి చేరుకోవడం ఎలా...

గాజువాక- అనకాపల్లి జాతీయ రహదారిలో కె.ఎస్.ఆర్.పేట బస్‌స్టాప్ నుంచి రాజుపాలెం గ్రామానికి సుమారుగా 5 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గంలో రైల్వే గేటు ఉండడంతో ఎక్కువసార్లు గేట్లు వేయడం వల్ల భక్తులకు ఇబ్బందిగా ఉంటుంది. విశాఖ నుంచి వచ్చే భక్తులు తాడి గ్రామం మీదుగా రాజుపాలెం, మునగపాక మండలం నుంచి వచ్చే భక్తులు ఎరుకవాలనిపాలెం గ్రామం మీదుగా రాజుపాలెం స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని రూరల్ సీఐ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

రాత్రికి ప్రత్యేక కార్యక్రమాలు....

వేడుకల సందర్భంగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం, బుర్రకథ, 20 మంది కళాకారులతో తప్పెట గుళ్లు, తొడపెద్దు సేవ, బాణాసంచా హంగామా, 200 మంది కళాకారులతో భక్తి రస కోలాటాలు, నమో వెంకటేశాయ నృత్య ప్రదర్శన వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

చట్ట సవరణ ఆలోచన విరమించుకోండి...


- 1/70పై స్పీకర్ వ్యాఖ్యలకు గిరిజన సంఘాల ఖండన



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన ఉద్యోగుల సంఘ నాయకులు ధనార్జన్, ధర్మరాజు, గిరిశాస్త్రి

నర్సీపట్నం : పెట్టుబడిదారులకు అనుకూలంగా 1/70 చట్టాన్ని సవరించాలన్న రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ధనార్జన్, జనరల్ సెక్రటరీ సమిడ ధర్మరాజు, ఉపాధ్యక్షుడు పి.వి.గిరిశాస్త్రి పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జనవరిలో విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి జరగాలంటే పెట్టుబడిదారులు స్టార్ హోటళ్లు నిర్మించుకునేందుకు అవసరమైతే 1/70 చట్టాన్ని సవరించాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు సరికాదన్నారు. చట్టం గురించి అవగాహన లేదంటూనే స్పీకర్ అలా మాట్లాడడం భావ్యం కాదన్నారు. చట్ట సవరణ జరిగితే ఆదివాసులు అటవీ హక్కు, భూమి మీద హక్కు, స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అమాయక గిరిజనుల భూములను ప్రైవేటు పెట్టుబడిదారులు కారు చౌకగా కొనేసి జీవనోపాధి లేకుండా చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అరకు, లంబసింగి ప్రాంతాలను అభివృద్ధి చేద్దామన్న ఆలోచన ఉంటే ఏపీ టూరిజం ద్వారా స్టార్ హోటల్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అరకు, లంబసింగి ప్రాంతాల్లో కాఫీ డెవలప్‌మెంట్ ఇండస్ట్రీ(ప్రాసెసింగ్ యూనిట్)ని ప్రభుత్వమే నిర్మించి గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు.

WORLD CANCER DAY



సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

VUDA 3 BHK Duplex Houses for Sale. 2400 Sft. with Car Parking at Sujathanagar, Teachers Layout. Contact : 98482 15235, 0891-2558326 [V- 13294]

FLAT FOR SALE

3BHK 1440 Sft. Flat for Sale at CID Office, Dharapalem, Near to Simhachalam New Toll Gate to Temple way. Ph : 80199 96677, 97057 74886 [V- 13305]

Services

GOLD LOANS

లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

OLD AGE HOME

Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [SCA25001472]

Wanted

Hiring Immediately Nursery to 10th Female Teachers for all Subjects upto 18K & Helpers 9K & Wanted PRO's (M/F) Gajuwaka, Kurmannapalem, Ph : 92992 56828, 70131 20064 [V- 12320]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

కారు ఢీకొని యువకుడు దుర్మరణం



సంఘటన స్థలంలో అశోక్ మృతదేహం




ప్రమాదంలో నుజ్జయిన కారు

పామూరు/కొండపి (ప్రకాశం జిల్లా): పామూరు మండలంలోని గోపాలపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం బూసిగూడెం గ్రామానికి చెందిన కూసు అశోక్, బుడమాల విష్ణు ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని గోపాలపురం వద్ద ఇటుక బట్టీల్లో పని చేసేందుకు రెండు రోజుల క్రితం వచ్చారు. ఆదివారం రాత్రి ఇద్దరు బైక్‌పై పామూరు వచ్చి తినుబండారాలు, ఇతర వస్తువులు తీసుకుని ఇటుక బట్టీల వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం గండిపాలేనికి వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ వెనుక సీటులో కూర్చున్న కూసు అశోక్ (21) రోడ్డుపై ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై టి.కిషోర్‌బాబు పరిశీలించారు. బైక్ నడుపుతున్న విష్ణుకు మోస్తరు గాయాలు కాగా, అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు.

దక్షిణ కోస్తా జోన్‌కు శూన్యమే..

- రైల్వే కేటాయింపుల్లోనూ అన్యాయమే..!
- రైల్వే బడ్జెట్‌లో ఒడిశాకు అధిక నిధులు



డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం

తాటిచెట్లపాలెం: కేంద్ర బడ్జెట్‌లో మరోసారి అన్యాయమే జరిగింది. కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా జోన్‌కు ఎటువంటి కేటాయింపులు జరగలేదు. దక్షిణ కోస్తా జోన్‌తో పాటు ప్రకటించిన రాయగడ డివిజన్‌కు మాత్రం అంబ్రెల్లా పనుల కింద రూ.1.50 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వం హయాంలోనే దక్షిణ కోస్తా జోన్ ప్రకటించారు. భవనాలను, స్థలాలను అప్పట్లోనే కేటాయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత నెలలో జోన్‌కు శంకుస్థాపన చేశారు. విశాఖ స్టేషన్ రీ డెవలప్‌మెంట్ గురించి ప్రకటించారు. కానీ ఇవేమీ ముందుకు సాగడం లేదు. బడ్జెట్‌లో దక్షిణ కోస్తా జోన్‌కు ఎటువంటి కేటాయింపులు చేయలేదు. ఏపీకి కేటాయింపులు ఉన్నా సింహభాగం దక్షిణ మధ్య రైల్వే పరిధి లోనే ఉన్నాయి.

ఒడిశాపై ప్రేమ.. ఏపీపై చిన్నచూపు

బడ్జెట్‌లో ఒడిశాకు రూ.10,599 కోట్లు కేటాయించగా, ఏపీకి మాత్రం అంతంత మాత్రంగా కేటాయింపులు చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఏపీ, తెలంగాణ, ఒడిశా బడ్జెట్ కేటాయింపులు, ప్రతిపాదనలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. సోమవారం సాయంత్రం దొండపర్తిలోని వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో కేంద్ర మంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. 2025-26 బడ్జెట్‌లో ఒడిశాకు 10,599 కోట్లు కేటాయించగా ఏపీకి మాత్రం రూ.9,417 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వీటిలో స్టేషన్ రీ డెవలప్‌మెంట్స్ ప్రాజెక్టులు, కొత్త ట్రాక్స్ ఏర్పాటు, విద్యుదీకరణ, మౌలిక వసుతులు కల్పిస్తారు. విశాఖ స్టేషన్ రీ డెవలప్‌మెంట్ గురించి ప్రకటించారు.. కాని ఇవేమీ ముందుకు సాగలేదు. దక్షిణ కోస్తా జోన్‌కు కేటాయింపులు లేవు.

10 స్టేషన్ల అభివృద్ధి

అనంతరం బడ్జెట్ కేటాయింపులపై డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ మాట్లాడారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో 10 స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ల కింద అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఏపీకి ఒడిశా కంటే దాదాపు వెయ్యి కోట్లు తక్కువ కేటాయింపులు చేసినా డీఆర్‌ఎం మాత్రం రికార్డు కేటాయింపులంటూ హర్షం వ్యక్తం చేశారు. త్వరలో పింక్‌బుక్ వస్తుందని, దీనిలో పూర్తి వివరాలు పొందుపరుస్తారని డీఆర్‌ఎం తెలిపారు.

గిరి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా
- జాబ్‌మేళాలో 105 మంది ఎంపిక



జాబ్‌మేళాను పరిశీలిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు: మారుమూల గిరిజన యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా అన్నారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు సోమవారం చింతూరులో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ చింతూరు సబ్ డివిజన్ పరిధిలో ఎంతోమంది చదువుకున్న యువత సరైన ఉపాధి అవకాశాలు లేక ఖాళీగా వుంటున్నారని వారి కోసం ఇలాంటి జాబ్‌మేళాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. యువత చెడుమార్గాల వైపు పయనించకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని, మరింత మంది యువతకు ఉపాధి కల్పించేందుకు ముందు మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని ఏఎస్పీ తెలిపారు. ఇన్నోవ్‌సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్ సహకారంతో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన 105 మంది గిరిజన యువత వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఉన్నికృష్ణన్, ప్రవీణ్‌కుమార్, సీఐలు దుర్గాప్రసాద్, కన్నపరాజు, ఎస్ఐలు రమేష్, శివనారాయణ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- పాఠశాలలో పెచ్చులూడిన శ్లాబ్
- భయంతో పరుగులు తీసిన విద్యార్థులు



పైకప్పు శ్లాబ్ పెచ్చులూడిన దృశ్యం



నేరేడువలస గ్రామంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

జి.మాడుగుల: మండలంలో నేరేడువలస గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు శ్లాబ్ పెచ్చులూడిపడిన సంఘటనలో త్రుటిలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. నేరేడువలసలోని జీపీఎస్ పాఠశాలలో సోమవార ఉదయం తరగతులు జరుగుతున్న సమయంలో భవనం పైకప్పు శ్లాబు పెచ్చులూడిపడ్డాయి. దీంతో విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పాఠశాలలో 32 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం మరమ్మతు పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు ద్వారా చేపట్టారు. భవనం పనులు అసంపూర్తిగా వదిలేశారని భాషా వలంటీర్ చిన్నమ్మి తెలిపారు. ఈ సంఘటన తెలుసుకొన్న ఎంఈవో బాబూరావుపడాల్ నేరేడువలస గ్రామంలో పాఠశాలను సందర్శించారు. పాఠశాల భవనాన్ని పరిశీలించి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులను పక్క గదిలోకి తరలించి పాఠశాలను నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్‌ను జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటన పై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నట్టు ఆయన తెలిపారు.



రాలిపడిన పెచ్చులు

లక్ష్యాన్ని మించి విద్యుదుత్పత్తి సాధిస్తాం

ఈఈ రాజేంద్రప్రసాద్

సీలేరు: సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి టార్గెట్‌ను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేస్తామని ఏపీ జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జల విద్యుత్ కేంద్రంలో నిర్దేశించిన సమయానికి టార్గెట్‌ను పూర్తి చేసేందుకు సిబ్బంది, ఇంజినీర్లు సమష్టిగా కృషి చేస్తున్నారన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం 4 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, గ్రిడ్ ఆదేశాల మేరకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో 418.62 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామని, ఈ ఏడాది టార్గెట్‌ను మార్చి 31 లోపు పూర్తి చేస్తామని ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

వైద్య విద్యార్థి విషాదాంతం

- నెల్లూరు బీచ్‌లో గల్లంతైన షణ్ముఖనాయుడు
- మృతదేహం లభ్యం
- మునగపాకలో విషాదఛాయలు



మృతుడు షణ్ముఖనాయుడు (ఫైల్)

మునగపాక(అచ్యుతాపురం): అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు తీరని లోకాలని వెళ్లిపోయాడని తెలుసుకున్న ఆ తల్లిదండ్రులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. సముద్రంలో గల్లంతైన వైద్య విద్యార్థి కోసం కన్నవాళ్లు పెట్టుకున్న ఆశలు సోమవారం ఉదయంతో గల్లంతయ్యాయి. వివరాలివి...మునగపాక గ్రామానికి చెందిన పెంటకోట కాశీ, మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బెంగళూరులో చదువుకుంటుండగా, రెండో కుమారుడు ఇటీవలే నెల్లూరులోని ఒక మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరాడు. ఆదివారం సెలవు కావడంతో సదరు వైద్యవిద్యార్థి షణ్ముఖనాయుడు (18) నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు ఏపీ జెన్కో పంప్ హౌస్ బ్యాక్ వాటర్ వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లారు. అక్కడ పెద్ద బండరాయి వద్ద వారు నిలబడి ఉండగా ఒక్కసారిగా నీటి మట్టం పెరగడంతో స్నేహితులు ఒక్కొక్కరుగా జారిపోయారు. ఈ ఘటనలో షణ్ముఖనాయుడు సముద్రంలో గల్లంతయ్యాడు. మత్స్యకారులు వలలు వేసి ఇద్దరిని రక్షించినప్పటికీ షణ్ముఖనాయుడి జాడ తెలియలేదు. సోమవారం పోలీసులు వెతగ్గా షణ్ముఖనాయుడు మృతదేహం వెలుగుచూసింది. దీంతో ఇక్కడ మునగపాకలో తీవ్ర విషాధ ఛాయలు అలుముకున్నాయి.

బంగారం కోసమే హత్య

- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- నిందితుడిపై మరో కేసు కూడా ఉంది
- వివరాలు వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా



చోడవరంలో విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

చోడవరం : తీవ్ర సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ముందుగా అంతా ఊహించినట్టుగానే బంగారం కోసమే మహిళను హత్య చేసినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలిసింది. నెల రోజులుగా ఎంతో ఉత్కంఠతో ఉన్న ఈ కేసు మిస్టరీ వీడడంతో పోలీసులు సైతం ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. నిందితుడు బంగారం కోసమే మహిళను హత్య చేసినట్టు ఆయన చెప్పారు. చోడవరం మండలం లక్కవరం పంచాయతీ శివారు మారుతీనగర్ సమీపంలో గవరవరం వెళ్లే రోడ్డు పక్కన ఈ ఏడాది జనవరి 9వ తేదీన పొలంలో లక్కవరం గ్రామానికి చెందిన ఒబలరెడ్డి నరసమ్మ అనే మహిళ హత్యకు గురైంది. మేకల కోసం గడ్డి కోసేందుకు కత్తి పట్టుకొని ఆమె వెళ్లింది. గడ్డికోసం వెళ్లిన తన భార్య చీకటి పడినా రాకపోవడంతో ఆమె భర్త నర్సింహమూర్తి వెతుకుతుండగా బండారు లక్ష్మయ్యకు చెందిన పొలంలో రక్తపుమడుగులో పడి ఉండడాన్ని గమనించి చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన డీఎస్పీ శ్రావణి పర్యవేక్షణలో చోడవరం ఎస్ఐ అప్పలరాజు, ఎస్ఐలు నాగకార్తీక్‌తో కూడిన పోలీసు, ప్రత్యేక ఐటీ కోర్, క్రైమ్ పోలీసు బృందాలను రంగంలోకి దింపామని ఎస్పీ చెప్పారు. వీరంతా సకాలంలో పూర్తి వివరాలు సేకరించి నిందితుడ్ని చోడవరం మండలం గజపతినగరం వద్ద సోమవారం ఉదయం పట్టుకున్నారని ఎస్పీ చెప్పారు. నిందితుడు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం జమ్మాదేవి పేటకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మహిళను హత్య చేసి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారాన్ని అపహరించాడని చెప్పారు. అపహరించిన బంగారాన్ని విజయనగరం కొత్తవలస ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.1.85లకు తాకట్టు పెట్టినట్టు గుర్తించామన్నారు. ఆ డబ్బులను నేరుగా నిందితుడే ఏటీఎంల ద్వారా లావాదేవీలు నిర్వహించినట్టు గుర్తించామన్నారు. ఆ సమయంలో సీసీ కెమెరాలు ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించి ఏపీతో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా వెతికామన్నారు. ఇతని దగ్గర నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఆ సమయంలో వేసుకున్న దుస్తులను స్వాధీనపర్చుకున్నామని ఎస్పీ చెప్పారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్పీ చెప్పారు. కాగా కోర్టు రిమాండ్ విధించింది.

నిందితుడిపై గతంలో మరో కేసు

లక్కవరం మహిళ హత్యకేసులో నిందితుడిపై గతంలో మరో కేసు ఉందని ఎస్పీ చెప్పారు. విజయనగరం జిల్లా కొత్తవలస పోలీసు స్టేషన్‌లో కూడా ఇతనిపై కేసు నమోదై ఉందని, ఓ మహిళను హత్య చేసి బంగారం అపహరించినట్టు కేసు నమోదై ఉందన్నారు. జిల్లా జైలు అధికారుల నుంచి సేకరించిన సమాచారంలో నిందితుడి కదలికలపై నిఘా పెంచడంతో పట్టుబడ్డాడని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ఎంతో నిబద్ధతతో పనిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.